
మధురానగర్ డి-బ్లాక్‌లో రహదారికి అడ్డంగా కారుపై నేలకొరిగిన భారీ వృక్షం


మధురానగర్ బి-బ్లాక్‌లో రహదారికి అడ్డంగా పడ్డ భారీ చెట్టుకొమ్మ


ఆనందనగర్‌కాలనీలో విరిగిపడ్డ చెట్టుకొమ్మ


ఆనందనగర్‌కాలనీలో కారుపై పడ్డ చెట్టు


అపోలో ఆస్పత్రి సమీపంలో నేలకూలిన చెట్లు

భారీ వర్షం..

ఇళ్లలోకి వరదనీరు

- పొంగిన డ్రైనేజీలు.. రోడ్లపై మురుగు ప్రవాహం
- కూలిన చెట్లు.. విద్యుత్ సరఫరాలో అంతరాయం

బంజారాహిల్స్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం కురిసింది. సోమవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరదనీరు చేరింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్.5 దేవరకొండబస్తీలో వరద ఉధృతితో పాటు నాలా పొంగడంతో సమీపంలోని ఇళ్లలోకి మురుగునీరు చేరింది. ఈ నీటిని బయటకు పంపేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఫిలింనగర్ బండారు బాల్‌రెడ్డినగర్‌లో ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద ఉధృతికి వాహనాలు కొట్టుకుపోయాయి. ఓ చెట్టు నేలకొరగడంతో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అపోలో ఆస్పత్రికి వెళ్లే దారిలో చెట్టు కూలడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. జూబ్లీహిల్స్‌లో తీవ్ర ట్రాఫిక్‌జామ్ నెలకొంది. ఫిలింనగర్ నుంచి జర్నలిస్ట్‌కాలనీ మీదుగా చెక్‌పోస్టుకు వెళ్లే దారిలో వాహనాలు భారంగా కదిలాయి.


దేవరకొండబస్తీలో ఇళ్లలోకి వెళ్తున్న వరద నీరు

అమీర్‌పేటలో స్తంభించిన ట్రాఫిక్


జలమయమైన సత్యం టాకీస్ రోడ్డు

అమీర్‌పేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలో అరగంటపాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. మైత్రివనం వెనకాల ఉన్న రెండు నాలాలు కబ్జాకు గురికావడంతో వరదనీరు సత్యం టాకీస్ నుంచి మైత్రివనానికి వచ్చే రహదారిపై చేరింది. మోకాలిలోతు వరకు రోడ్డుపై నిలిచిన నీటి వల్ల అరగంటపాటు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. లోతట్టు ప్రాంతాలైన బుద్ధనగర్, గంగుబాయి బస్తీల్లోకి చేరిన వరదనీటితో స్థానికులు అవస్థలు పడ్డారు. నాలాల పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయించి వరద ముప్పు నుంచి కాపాడాలని ప్రజలు జీహెచ్‌ఎంసీ అధికారులను కోరుతున్నారు.


బండారు బాల్‌రెడ్డినగర్‌లో వరద ఉధృతి

విరిగిపడ్డ చెట్టుకొమ్మలు..

పంజాగుట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌కాలనీ బి,డి-బ్లాక్‌లు, ఖైరతాబాద్ ఆనందనగర్ కాలనీల్లో చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. 11కేవీ విద్యుత్ తీగ తెగడంతో మధురానగర్ డి,హెచ్ బ్లాక్‌లలో సోమవారం సాయంత్రం 4.30 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. డి-70 వద్ద భారీ వృక్షం రహదారికి అడ్డంగా వేళ్లతో సహా నేలకొరిగింది. చెట్టుకొమ్మలు పడడంతో రెండు కార్లు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఆ సమయానికి కార్లు, రహదారిపై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు, కాలనీ సంక్షేమ సమితి ప్రతినిధులు విద్యుత్, జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఆయా విభాగాల సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మధురానగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు కోడె సాంబశివరావు, ప్రతినిధులు అక్కడే ఉండి చెట్టు కొమ్మలను పక్కకు తొలగిస్తున్నారు. ఆనందనగర్‌కాలనీలో సిబ్బంది చెట్టుకొమ్మలను తొలగిస్తున్నారు.


యాదగిరిగౌడ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తలసాని

బీఆర్‌ఎస్ సీనియర్ నేత మృతి

బేగంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ సీనియర్ నేత అనారోగ్యంతో మృతిచెందాడు. బేగంపేట డివిజన్ శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతానికి చెందిన యాదగిరిగౌడ్ కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ఆస్పత్రిలో నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నేతలు శ్రీహరి, సత్యనారాయణ, సురేష్‌యాదవ్, నరేష్ తదితరులు ఉన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డ్రింక్‌ప్రైమ్ సంస్థ ప్రతినిధులు

క్రికెట్ టోర్నమెంట్ విజేత ఫైటర్స్ స్టార్ జట్టు

కూకట్‌పల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): డ్రింక్ ప్రైమ్ ప్రీమియర్ లీగ్ పేరుతో కేపీహెచ్‌బీకాలనీలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో ఫైటర్స్ స్టార్ జట్టు విజేతగా నిలిచింది. పోటీల్లో 10 జట్లు పాల్గొనగా.. ఫైనల్స్‌లో విజయం సాధించిన ఫైటర్స్ జట్టుకు రూ.లక్ష బహుమతి సోమవారం అందజేశారు. ఈ పోటీలో ఫైటర్ స్టార్ జట్టు నుంచి ఆమోర్ జాంటీను ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా, సన్‌రైజర్స్ ఎలెవెన్ జట్టు నుంచి నితీష్ బోయను ఉత్తమ బౌలర్‌గా ప్రకటించడంతో పాటు చెరో రూ.10 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. విజేతలకు డ్రింక్‌ప్రైమ్ సంస్థ నిర్వాహకులు విజయేందర్‌రెడ్డి, మానస్ రంజన్ బహుమతులు అందజేశారు.


పద్యనాటక కళాకారులను సన్మానిస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కళలను భావితరాలకు అందించాలి

కూకట్‌పల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ అన్నారు. కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శ్రీకృష్ణరాయభారం పద్యనాటక ప్రదర్శనకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ పద్య నాటకాలు, నాటికలు, పురాతన కళలను చూస్తుంటే చిన్ననాటి రోజులు గుర్తుకొస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పద్యనాటక కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు తోట సత్యనారాయణ, శ్యామ్, మురళీధర్, శివకుమార్, నాయకులు కొల్లా శంకర్, ప్రసాద్, వాసుదేవరావు, షణ్ముక, మోహన్, రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రమణకుమార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు

ముద్రణాలయం డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

ఖైరతాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం డైరెక్టర్‌గా సీహెచ్ రమణకుమార్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఆర్.ఈశ్వరయ్య, ప్రతినిధులు జి.శ్రీనివాస్, విజయ్‌కుమార్, బాల్‌కుమార్, సంతోష్‌కుమార్, విశ్వసేన, నరహరి తదితరులు శుభాకాంక్షలు చెప్పారు. అలాగే, బదిలీ అయిన శ్రీనివాసచారికి వీడ్కోలు పలికారు.

నేడు సమస్యలపై శంఖారావం

బంజారాహిల్స్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నేడు కమలాపురికాలనీ సంక్షేమ సంఘం ప్రాంగణంలో సమస్యలపై శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసనసభ్యులు మాగంటి గోపీనాథ్ తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జలమండలి, జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, పోలీస్ తదితర విభాగాల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. స్థానికంగా ఉన్న సమస్యలపై సమీక్షిస్తామని, అవసరమైతే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తామని తెలిపారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమం నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ఘనంగా వేడుకలు
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు


అజారుద్దీన్‌తో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి

త్యాగానికి, సత్యానికి ప్రతీక బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వీరికి పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు శుభాకాంక్షలు చెప్పారు. మహ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను, సహోదర భావాన్ని అందరూ అనుసరించాలని పలువురు పేర్కొన్నారు. రెహ్మత్‌నగర్ ఎస్పీఆర్‌హిల్స్ మైదానంలో నిర్వహించిన ప్రార్థనల్లో టీం ఇండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్, కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబాఫసీయుద్దీన్‌లు పాల్గొన్నారు. ఖైరతాబాద్‌లోని కుతుబ్‌షాహి మసీద్, ఎంఎస్‌మక్తాలోని ఈద్గా వద్ద మాజీ కార్పొరేటర్ ఎస్‌కె.షరీఫ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

● యూసుఫ్‌గూడ/ఎర్రగడ్డ/ఖైరతాబాద్


రెహ్మత్‌నగర్ ఎస్పీఆర్‌హిల్స్ మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


బక్రీద్ వేడుకల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు మహ్మద్ సలీం జావెద్ తదితరులు

బోర్‌వెల్ నిర్వాహకుడిపై బీఆర్‌ఎస్ నాయకుల దాడి

యూసుఫ్‌గూడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బోర్‌వెల్ నిర్వాహకుడిపై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేశారు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామ్‌నగర్‌కు చెందిన మహ్మద్ షకీర్ బోర్‌వెల్ వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం రాత్రి రెహ్మత్‌నగర్‌లో బోర్‌వెల్ పని పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తున్నాడు. హనుమాన్ ఆలయం వద్ద వాహనాన్ని డ్రైవర్ రివర్స్ తీస్తుండగా అక్కడ ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు అరుణ్, మహేష్ బూతులు తిడుతూ దాడి చేశారు. డ్రైవర్ వెంకటేష్‌ను రాయితో కొట్టారు. రాడ్‌తో షకీర్‌పై దాడి చేశారు. బాధితులు చికిత్స చేయించుకున్న అనంతరం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎల్‌ఆర్‌టీ కాలేజీ విద్యార్థుల రక్తదానం


రక్తదానం చేస్తున్న విద్యార్థి

నిజాంపేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎంఎల్‌ఆర్‌టీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం విద్యార్థులు సోమవారం రక్తదానం చేశారు. అనంతరం 200 మంది చిన్నారులకు భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అరుందతి ఆస్పత్రి డీన్ డాక్టర్ ఉదయ్‌కుమార్, బాలాజీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగామ్ నిర్వాహకులు ఉదయ్‌రంజన్‌గౌడ్, వలంటీర్లు ప్రశాంత్, ఆర్యన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం వస్తే కన్నీళ్లే

- చినుకు పడితే చాలు ఉస్మాన్‌నగర్, సైఫ్ కాలనీవాసులకు వణుకు
- 2010, 2021లో వరదనీటిలో మునిగిన ఇళ్లు
- పట్టాలు ఇచ్చి స్థలం చూపించని అధికారులు


బుర్హాన్‌ఖాన్ చెరువులో నేటికీ నీటిలో మునిగి ఉన్న ఇళ్లు

పహాడిషరీఫ్ జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైందంటే ఆ కాలనీవాసులకు కన్నీళ్లే. చినుకు పడితే చాలు ఇళ్లలోకి భారీగా వరదనీరు చేరుతుండడంతో వణికిపోతున్నారు. ఇది జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఉస్మాన్‌నగర్, సైఫ్ కాలనీవాసుల దుస్థితి. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని వారికి కంటిమీద కునుకు ఉండదు. అర్ధరాత్రి వర్షం పడితే ఇళ్లలోకి వరదనీరు చేరుతుంది. దీంతా ఈ నాలుగు నెలలు ఇళ్లు ఖాళీ చేసి బయట అద్దెకు ఉండాల్సిన పరిస్థితి. బుర్హాన్‌ఖాన్ చెరువులో నేటికీ కొన్ని ఇళ్లు నీటిలోనే మునిగి ఉన్నాయి.

తూము మూసేయడంతోనే..

వర్షాకాలంలో పహాడిషరీఫ్, షాహీన్‌నగర్, ఆర్‌సీఐ, న్యూ బాబానగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వరద నేరుగా వచ్చి బుర్హాన్‌ఖాన్ చెరువులోకి చేరుతుంది. గతంలో చెరువులోని తూమును కొంతమంది మూసివేశారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములను రైతులు ఇతరులకు విక్రయించారు. భూములు కొనుగోలు చేసిన వారు ప్లాట్లు చేసి విక్రయించారు. దాంతో వర్షాలు కురిసిన ప్రతీసారి వరదనీరు వెళ్లే దారిలేక బస్తీలు, కాలనీలలోకి చేరుతుంది.


ప్రజాధనం వృథా

బుర్హాన్‌ఖాన్ చెరువులోకి వచ్చే వరద ఉస్మాన్‌నగర్, సైఫ్‌కాలనీ తదితర బస్తీలకు వెళ్లకుండా 2021లో దాదాపు రూ. 22 లక్షలతో రింగ్‌బండ్ నిర్మించారు. భారీ వర్షాలకు రింగ్‌బండ్ నీట మునిగిపోయింది. నాణ్యత లేకుండా పనులు చేయడంతోనే రింగ్‌బండ్ మట్టి కొట్టుకుపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీట మునుగుతున్న కాలనీవాసులను అప్పట్లో అన్ని రాజకీయపార్టీల నాయకులు వచ్చి పరామర్శించి హామీలు ఇచ్చి ఫొటోలకు ఫోజులిచ్చారు తప్ప, సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీల సమస్యలపై గతేడాది కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నీటిలో నిలబడి కొవ్వొత్తుల ప్రదర్శన, ఇందిరాపార్కు వద్ద ధర్నా చేయగా, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు బుర్హాన్‌ఖాన్ చెరువును పరిశీలించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది, ఇప్పుడైనా ఆ పార్టీ నాయకులు వరద సమస్యను పరిష్కరించాలని ఆయా బస్తీలు, కాలనీల ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నారు.

హామీలే... భూములు ఇవ్వడం లేదు

2021లో భారీస్థాయిలో వర్షాలు కురిసినప్పుడు ఉస్మాన్‌నగర్ బస్తీ నీట మునిగిపోయింది. అప్పటి మంత్రి షబ్బీర్ అలీ నీట మునిగిన ఇంటి యజమానులకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి కొందరికి పట్టాలు అందజేశారు. వారిలో నిజమైన బాధితులకు అందకపోవడం గమనార్హం. 2010లో మరోసారి కురిసిన భారీ వర్షాలకు ఉస్మాన్‌నగర్‌తోపాటు పలు బస్తీలు నీటిలో చిక్కుకున్నాయి. అప్పటి హోం మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతో బాలాపూర్ గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 144, 150లో కొంతమందికి మాత్రమే పట్టాలు అందజేశారు. పట్టాలు ఇచ్చిన అధికారులు స్థలాలు మాత్రం చూపించలేదు. దాంతో సర్వే నంబర్ 144లోని భూమి నేడు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయింది.

అందజేసిన పట్టాలు (ఫైల్) →



ప్రజలను చైతన్యం చేసే రచనలు చేయాలి

- ఆధ్యాత్మికవేత్త నరసింహప్ప


మేఘ సందేశం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మికవేత్త నరసింహప్ప, డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ రాధాకుసుమ, తదితరులు

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు ఆధ్యాత్మిక రచనలతో సమాజాన్ని చైతన్యవంతం చేయాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప అన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని కళాభారతిలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన ప్రముఖ రచయిత్రి భువనేశ్వరి మారేపల్లి రాసిన మేఘ సందేశం పుస్తకావిష్కరణ చేసి ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మికత నేపథ్యంలో మేఘసందేశం పుస్తకాన్ని సమీక్షించి సైన్స్ ఆధ్యాత్మికత ఒకటేనని పలు అంశాలపై సోదాహరణంగా వివరించారన్నారు. రచయిత్రి భువనేశ్వరి ఆధ్యాత్మిక రచనల్లో మేఘసందేశం అద్భుతమైన గ్రంథమన్నారు. కార్యక్రమంలో కవులు డాక్టర్ జెల్లి విద్యాధర్, శ్రీనాథ, డాక్టర్ కాపూరి శ్రీనివాస్, యాంకర్ జి. నవీనరాణి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన రాష్ట్ర కన్వీనర్‌గా సైదానాయక్


సైదానాయక్

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): త్రిసభ్య కమిటీలో కొద్దిమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం సంఘాన్ని ఉపయోగించుకున్నందుకు పాత కమిటీ రద్దు చేశామని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవనాయక్ తెలిపారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవాలాల్ సేన రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్, వ్యవస్థాపక ధర్మ జాగరణ జాతీయ అధ్యక్షుడిగా రమేష్ మహరాజ్, ప్రధాన కార్యదర్శిగా స్వరాజ్ నాయక్, ఉద్యోగ సేన రాష్ట్ర ఇన్‌చార్జిగా మూడావత్ కృష్ణానాయక్, కో-కన్వీనర్లు, తదితరులను నియమించినట్లు ఆయన తెలిపారు.

సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా నరేష్‌బాబు

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సామాజిక, సమరసత వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ ఆకుల నరేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బర్కత్‌పురాలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నరేష్‌బాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సమరసత వేదికను బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. శ్యామ్‌ప్రసాద్, అప్పల ప్రసాద్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కులగణనకు సమగ్ర చట్టం తీసుకురావాలి

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన చేపట్టేందుకు అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేసి సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమగ్ర చట్టం వస్తేనే బీసీల సామాజిక ఆర్థిక అంశాలపై వివరాలు తీసుకోవచ్చని చెప్పారు.

అసంపూర్తిగా నాలా నిర్మాణ పనులు

- పొంచి ఉన్న ప్రమాదం
- ఆందోళనలో లోతట్టు ప్రాంత ప్రజలు

మారేడుపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మహేంద్ర హిల్స్ పక్కనే ఉన్న ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌లో కంటోన్మెంట్ బోర్డు అధికారులు నాలుగు నెలల క్రితం రూ.40లక్షల వ్యయంతో నాలా, సీసీ ర్యాంపు, నిర్మాణ పనులు చేపట్టారు. సగంలోనే పనులను నిలిపివేశారు. అధికారుల నిర్లక్ష్య ధోరణితో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

ఓ వైపు బోర్డు అధికారుల అశ్రద్ధ, పట్టింపులేని వైనం వెరసి ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీవాసులు వర్షాలు కురుస్తున్న ప్రతిసారీ భయం గుప్పెట్లో ఆందోళన చెందుతున్నారు. బోర్డు అధికారులు చేపట్టిన నాలా పనులు పూర్తికాకపోవడంతో ఈస్ట్ మారేడుపల్లి, మహేంద్ర హిల్స్ ఎత్తయిన ప్రాంతాల నుంచి వస్తున్న వరద ఆజాద్ చంద్ర శేఖర్ నగర్‌ను భయపెడుతోంది. సగం బస్తీని వ ముంచె త్తు తోంది. ముఖ్యంగా ఆజాద్ చంద్ర శేఖర్‌నగర్ బస్తీ ప్రజలు ప్రతిరోజు కూలికి వెళ్లకుంటే పూట గడవని పరిస్థితి. వీరందరూ వారి వారి పనుల నిమిత్తం తెల్లవారుజాము నుంచి అడ్డాల వద్దకు చేరుకుంటారు. వివిధ పనులకు వెళ్లి సాయంత్రం తర్వాత ఇంటికి తిరిగి వస్తుంటారు. ప్రమాదకరంగా మారిన నాలాపైనే రాకపోకలు సాగిస్తున్నారు. బోర్డు అధికారులు పనులు జరుగుతున్న దారిలో బారికేడ్లు ఏర్పాటుచేసినప్పటికీ బస్తీలోనికి వెళ్లడానికి మరో దారి లేదు. దీంతో ఈ దారిగుండానే స్థానిక ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదకరంగా మారిన నాలా పనులను వెంటనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



నిర్మాణం పూర్తికాని నాలా ప్రమాదకరంగా మారడంతో ఏర్పాటు చేసిన బారికేడ్లు


ప్రమాదకరంగా మారిన నాలా వద్ద బారికేడ్లు ఏర్పాటు

పనులు తక్షణమే పూర్తి చేయండి



లోతట్టు ప్రాంతంలో వరదనీరు నిలువకుండా నాలా నిర్మాణ పనులు చేపట్టారు. సగం పనులు పూర్తిచేసి నిలిపివేశారు. దీంతో వర్షం కురిసిన ప్రతిసారీ వరద కారణంగా మేము ప్రమాదాలకు గురవుతున్నాం. స్థానిక ప్రజల ఇబ్బందులను గుర్తించి పనులను పూర్తిచేయాలి

- మల్లమ్మ, ఆజాద్ చంద్రశేఖర్ నగర్ నివాసి

ప్రమాదాల బారినపడుతున్నాం



కంటోన్మెంట్ బోర్డు నిధులతో నాలా అభివృద్ధి పనులను పూర్తిచేయడంలో బోర్డు అధికారులు అశ్రద్ధ చూపుతున్నారు. ఓపెన్ నాలా వద్ద ఏర్పాటుచేసిన ఇనుప సీకులతో ఆ దారిగుండా వెళుతున్న క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నాం. రాకపోకలు సాగించే రహదారుల్లో పనులు ప్రారంభించి పూర్తిచేయాలి.

- అనిత, ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ నివాసి

వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

మహేంద్ర హిల్స్ ఆజాద్ చంద్రశేఖర్‌నగర్ బస్తీ లోతట్టు ప్రాంతంలో వరదనీరు నిలవకుండా ఉండేందుకు నాలా అభివృద్ధి పనులను చేపట్టాం. పలు సాంకేతికపరమైన ఇబ్బందుల కారణంగా పనులు నిలిచిపోయాయి. వారం రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- దినేష్, కంటోన్మెంట్ ఇంజనీర్


అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న దృశ్యం

అక్రమ నిర్మాణం కూల్చివేత

- ఎమ్మెల్యే ఆదేశాలతో కూల్చివేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు

రెజిమెంటల్‌బజార్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లో ఓ లాడ్జి నిర్వాహకుడు చిన్న గల్లీని మూసివేసి అదనపు నిర్మాణంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ కోసం దిమ్మె నిర్మించాడు. ఈ అక్రమ నిర్మాణం గూర్చి కాంగ్రెస్ నాయకులు, బస్తీవాసులు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం బస్తీపర్యటనలో భాగంగా ఎమ్మెల్యే రెజిమెంటల్‌బజార్‌ను సందర్శించినపుడు స్వయంగా పరిశీలించి, టౌన్‌ప్లానింగ్ అధికారులతో మాట్లాడి అక్రమ నిర్మాణం అయితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో సోమవారం అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఫిర్యాదు చేయగానే స్పందించి, చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు బస్తీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ఫిట్స్‌తో ప్రయాణికుడి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో ఫిట్స్‌తో గుర్తుతెలియని ప్రయాణికుడు మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్ నెంబరు 10లో 50ఏళ్ల వ్యక్తి సోమవారం అనారోగ్యంతో ఫిట్స్ వచ్చి అక్కడికక్కడే మరణించాడు. రైల్వే స్టేషన్ డిప్యూటీ స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలూ లేవని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిస్తే 8712658586 నంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతున్న సమయంలో ఓ వ్యక్తిని రైలు ఢీకొని అక్కడికక్కడే మరణించిన ఘటన డబిల్‌పురా రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. డబిల్‌పుర ప్రాంతానికి చెందిన పవన్‌కుమార్ (21) సోమవారం డబిల్‌పుర - మేడ్చల్ రైల్వే స్టేషన్‌ల సమీపంలో తన పొలం పనులు చూసుకుని తిరిగి తల్లి వద్దరు రావడానికి రైలు పట్టాలు దాటుతున్నాడు.

ఈ సమయంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుడిలో నిద్రకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం


నారాయణ

బోయినపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కూతురు ఆరోగ్యం బాగుండాలని గుడిలో నిద్రించడానికి భార్యతో వెళ్లిన భర్త అదృశ్యమైన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం మల్కాజిగిరి చాణిక్యపురి కాలనీకి చెందిన డి.నారాయణ (38), భార్య అనిత (33)ల కుమార్తె ఆరోగ్యం బాగోలేదు. దీంతో బంధువులు రమేష్, దుర్గేష్‌లతో కలిసి సికింద్రాబాద్ తాడ్‌బంద్ దేవాలయానికి ఆదివారం రాత్రి వెళ్లారు. మొక్కులు చెల్లించుకుని ఆ రాత్రి ఆలయ ప్రాంగణంలోనే వారి కారులో ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో పెట్రోలింగ్ వాహనంలో వచ్చిన పోలీసులు వారి నుంచి వివరాలు సేకరిస్తున్న సమయంలో పక్క నుంచి నారాయణ ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడు. అతనికోసం తెల్లవారే వరకు వేచి చూశారు. ఫోన్ చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో బంధువులను, తెలిసిన వారిని ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో అనుమానం వచ్చిన భార్య అనిత బంధువులతో కలిసి సోమవారం సాయంత్రం బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది

- కార్పొరేటర్ రాసూరి సునీత

చిలకలగూడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆకలితో వున్న వారికి అన్నదానం చేయడం గొప్పదని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. డివిజన్ పరిధిలోని పోచమ్మ ఆలయంలో సోమవారం బోనాల పండుగ ముందు నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అన్ని దానాలలోకి అన్నదానం గొప్పదని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులను అభినందించారు.


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఉప్పల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కుమ్మరి బస్తీలో రూ.30లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాలించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్


చిలకలగూడ ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు


బక్రీద్ వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీగణేష్


బోయినపల్లిలో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

సికింద్రాబాద్, బౌద్ధనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : లష్కర్‌లో బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సికింద్రాబాద్, కంటోన్మెంట్‌లలోని ముస్లింలు ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిలకలగూడ ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారాసిగూడ కౌసర్ మసీద్, షాబాద్‌గూడ, మహ్మద్‌గూడ, శ్రీనివాసనగర్ మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు అనుదీప్ (చిలకలగూడ), సైదులు (వారాసిగూడ) పర్యవేక్షణలో మసీదుల వద్ద, ముఖ్యకూడళ్లలో భారీ బందోబస్తును ఏర్పాటుచేశారు. ముస్లింలు పేదవారికి కుర్బానీని అందజేశారు. బోయినపల్లి, బాలంరాయి, కార్ఖానాలలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్, కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తదితరులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.


రసూల్‌పురా మసీదు వద్ద ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న బోయినపల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్


తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఎస్ఆర్ నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యుల పరామర్శ

తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన ఎస్ఆర్ నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు

మారేడుపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఎస్ఆర్ నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు పరామర్శించారు. అదేవిధంగా రాధిక కాలనీలోని తలసాని శంకర్ యాదవ్ నివాసంలో ఆయన చిత్రపటానికి సోమవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విషయం తెలుసుకున్న సీనియర్ సిటిజన్స్ సోమవారం వెస్ట్ మారేడుపల్లిలోని ఆయన నివాసానికి చేరుకొని శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు. కౌన్సిల్ అధ్యక్షులు మానిక్ రావు పాటిల్, ముత్తారెడ్డి, శంకర్, పార్థసారధి, కృష్ణారెడ్డి, కృష్ణదేవ్ గౌడ్, అరవింద్ గౌడ్, ప్రసాద్‌లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

లోహియానగర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యేకు టీటీడీపీ నేతల వినతి

తిరుమలగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని లోహియానగర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీటీడీపీ నేతలు సోమవారం ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి విన్నవించారు. లోహియానగర్‌లో మంచినీటి సరఫరా సరిగా లేదని, సమస్య అధికంగా ఉందని తెలిపారు. విద్యుత్ స్తంభాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించాలని కోరారు. గతంలో బస్తీవాసుల కోసం జలమండలి అధికారులు నల్లా కనెక్షను ఏర్పాటు చేశారని, దాని ద్వారా నీళ్లు పట్టుకొని తాగుతూ అవసరాలకు వాడుకునేవారిమని, ప్రస్తుతం ఆ నల్లా కనెక్షను తిరిగి ఏర్పాటుచేయాలని కోరారు. సమస్యలు అన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్ వారికి హామీ ఇచ్చారు. టీటీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఎం.మధుసూదన్‌రావు, టీటీడీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ కే.ప్రతాప్, టీటీడీపీ హైదరాబాద్ నగర ఉపాధ్యక్షుడు డీ.ఆర్.శ్రీనివాస్, చంద్రశేఖర్, డీ.వై.సుదర్శన్, నాగరాజ్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, శంకర్ యాదవ్ ఉన్నారు.


కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన కార్పొరేటర్ అమృత

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి

- కార్పొరేటర్ అమృత

ముషీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని నల్లకుంట కార్పొరేటర్ అమృత అన్నారు. కరాటే, తైక్వాండోలో శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఆదివారం పద్మాకాలనీలో సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు ఆత్మరక్షణకు దోహదపడుతాయన్నారు. క్రీడల్లో రాణించేవారికి కేంద్ర ప్రభుత్వం విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు సైతం కల్పిస్తున్నదని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రీడలపై దృష్టి సారించి తమకు నచ్చిన క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పద్మాకాలనీ కార్యదర్శి రూపేందర్, ఉపాధ్యక్షులు గౌరీశంకర్, ఉమా తైక్వాండో అకాడమీ ఫౌండర్, సీనియర్ కోచ్ ప్రసన్న ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


పవర్‌బోర్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గున్నాల సునీతా యాదవ్

పవర్‌బోర్ పనులు ప్రారంభం

మౌలాలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సంతోషిమాతనగర్ కాలనీ సంక్షేమ సంఘ భవన ప్రాంగణంలో సోమవారం పవర్‌బోర్ పనులను కార్పొరేటర్ గున్నాల సునీతాయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, లింగరావు, మురళీకృష్ణ, కాలనీ అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

చదువుతోనే బలహీన వర్గాలకు గౌరవం

- ఎంపీ ఆర్. కృష్ణయ్య

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చదువుకుంటేనే ప్రత్యేకంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కుల గౌరవం, కుటుంబ గౌరవం పెరుగుతుందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బడికి పోదాం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీలు తమ పిల్లలను బడికి పంపాలని కోరారు. పిల్లలు చదువుకుంటే భవిష్యత్‌లో వారు డాక్టర్స్, ఇంజనీర్స్, కలెక్టర్స్, ఆఫీసర్స్ అవుతారని, గౌరవం పెరుగుతుందని ఆ కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటే వారిలో దాగిఉన్న జ్ఞానం, ప్రతిభ బయటకు వస్తాయని, దీని మూలంగా దేశంలో ప్రగతి పథంలో నడుస్తుందని, భారతదేశం అగ్రదేశంగా తయారవుతుందన్నారు. విద్య ద్వారానే కుల నిర్మూలన జరుగుతుందని, మూఢ విశ్వాసాలు, మూఢ నమ్మకాలు తొలగిపోతాయని, అజ్ఞానం, అంధకారం, అమాయకత్వం నుంచి ప్రజలను విముక్తి చేసి ఒక విజ్ఞానవంతమైన శాస్త్రీయ జ్ఞానంతో కూడిన సమాజం నిర్మాణం చేయగలమన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


మారేడుపల్లి ఎల్ శంకర్ నగర్ బస్తీ ముందు రోడ్డుపై నిలిచిన వరద నీరు


ఎన్‌టిఆర్ స్టేడియం వద్ద స్టీల్ బ్రిడ్జి కింద వరదనీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్న మునిసిపల్ సిబ్బంది


కవాడిగూడ గాంధీనగర్ బ్రిడ్జి వద్ద మోకాళ్లలోతు వరదనీరు ప్రవహిస్తున్న దృశ్యం

లష్కర్‌లో భారీ వర్షం

- పోటెత్తిన వరద నీరు
- జలమయమైన రోడ్లు, లోతట్టు ప్రాంతాలు
- స్టీల్ బ్రిడ్జి కింద నిలిచిన వరదనీరు
- వరదనీటిని తొలగించిన జీహెచ్ఎంసీ సిబ్బంది

సికింద్రాబాద్, మారేడుపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): లష్కర్‌లో సోమవరం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలనీలు, బస్తీల్లో చాలా సేపు వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మారేడుపల్లి, రెజిమెంటల్‌బజార్, బోయినపల్లి సాయిబాబా కాలనీ, సౌజన్య కాలనీ, సీతారాంపూర్, అన్నానగర్, రసూల్‌పురా తదితర ప్రాంతాల్లో వర్షం కారణంగా ఇక్కట్లకు గురయ్యారు. మోండా మార్కెట్ డివిజన్ పరిధిలోని మారేడుపల్లిలో సోమవారం సాయత్రం కురిసిన వర్షానికి ఎల్. శంకర్ నగర్ బస్తీ ముందు రోడ్డుపై వర్షపు వరద నీరు నిండుగా నిలిచింది. దీంతో స్థానిక ప్రజలు గంటల తరబడి ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షం కురిసినప్పటికీ ఇలాంటి సమస్య గత పది సంవత్సరాలుగా ఉత్పన్నమవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎత్తైన ప్రాంతాలైన ఈస్ట్, వెస్ట్ మారేడుపల్లి ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరంతా లోతట్టు ప్రాంతమైన ఎల్ శంకర్ నగర్ బస్తీలో నిలుస్తుంది. ఇన్ని సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కవాడిగూడ : ముషీరాబాద్ నియోజకవర్గం పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమై వాహనదారులు. పాదారులు అనేక ఇబ్బందులుపడ్డారు. ఎన్‌టీఆర్ స్టేడియం, ఇందిరాపార్కు చౌరస్తా స్టీల్ బ్రిడ్జి కింద మోకాళ్లలోతు వర్షం వరద నీరు ప్రవహించడంతో వాహనదారులు, పాదాచారులు స్టీల్ బ్రిడ్జి కింద నిలబడి పోయారు. కవాడిగూడ, రాంనగర్, ముషీరాబాద్, వీఎస్టీచౌరస్తా, అశోక్‌నగర్ చౌరస్తా, ఇందిరాపార్కు చౌరస్తా, గాంధీనగర్ బ్రిడ్జి, కల్పానాథియేటర్ చౌరస్తా, పద్మశాలికాలనీ, ఎస్‌బిఐ కాలనీ రోడ్, గాంధీనగర్, పిఅండ్ కాలనీ రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దాదాపు గంటసేపు కురిసిన భారీ వర్షం వల్ల ఎక్కడికక్కడ రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోయింది.


వీఎస్టీ చౌరస్తాలో స్టీల్ బ్రిడ్జికింద నిలిచి పోయిన వరదనీటితో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ఉచిత వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

భోలక్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం

ముషీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ బడీ మసీదు వద్ద సోమవారం బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.